మల్హార్‌రావు ఆశయాలు కొనసాగిద్దాం

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మల్హార్, ఆగస్టు 12 : మల్హార్ మండల అభివృద్ధి ప్రదాత మల్హార్‌రావు ఆశయాలను కొనసాగిద్దామని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అన్నారు. ఆయన జయంతి సందర్భంగా మండలకేంద్రంలోని కొయ్యూరులో సోమవారం మల్హార్ రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మధు మాట్లాడుతూ నాడు సర్పంచ్‌గా మల్హార్‌రావు మండల అభివృద్ధికి బీజం వేశారని గుర్తు చేశారు. నాగులమ్మ ఆలయం నుంచి మల్లారం తాడిచెర్ల వరకు రోడ్డు నిర్మాణం కోసం అధికారులను ఎదిరించారని, ప్రజల అవసరాల కోసం ఎవరినైనా ఎదిరించ వచ్చని గొప్ప సూక్తిని చాటారన్నారు. కుమ్రం భీం స్ఫూర్తితో ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, అడవులు అడ్డంగా ఉన్నా రోడ్ల నిర్మాణం చేయించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆ తర్వాత జరిగిన అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే జరిగిందన్నారు. ప్రజల కోసం పుట్టిన వాళ్లు ఏ విధంగా ఉంటారో, ప్రజలను వాడుకునే వాళ్లు ఏ విధంగా ఉంటున్నారో చాటి చెప్పనన్ని రోజులు చీకట్లోనే ఉంటామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, సింగిల్ విండో మాజీ చైర్మన్ చెప్యాల రామారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, నాయకులు రాజేశ్వర్‌రావు, యాదగిరిరావు, సిద్ధ లింగమూర్తి, ఆయూబ్‌ఖాన్, దేవరనేని రాజేశ్వర్‌రావు, సత్యనారాయణ, జాగిరి హరీశ్, మధు, హరి ప్రసాద్, సుంకు రాము, ముత్తయ్య పాల్గొన్నారు. అనంతరం తాడిచెర్లలో కామ సమ్మక్క ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను, కొయ్యూరులో చెలిమెల వెంకటరెడ్డి విద్యుత్ షాక్‌తో మృతి చెందగా ఆయన కుటుంబాని పుట్ట మధు పరామర్శించారు.

మల్హార్‌రావు విగ్రహానికి పూలమాల వేస్తున్న పుట్ట మధు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం, ఆగస్టు 12 : నియోజకవర్గంలోని గ్రామాల సమగ్రాభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేసి పనులు త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండలంలోని బుద్ధారం నుంచి పొట్టిగుట్ట రోడ్డు మరమ్మతు పనులకు ఆయన శంకుస్థాపన చేసి, ఎస్సీ కాలనీ నుంచి బీసీ కాలనీ వరకు చేపట్టిన రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలాలను అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్లేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముక్కెర హేమంత్, మాజీ వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, మాజీ సర్పంచ్ గండ్ర ఆగమరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వంగపల్లి భాస్కర్, గణపసముద్రం మత్స్య శాఖ డైరెక్టర్ గూళ్ల రాజకుమార్, నాయకులు అంబడిపెల్లి సంపత్ రావు, మాల భద్రయ్య, ఐలు స్వామి యాదవ్, గూళ్ల భద్రయ్య పాల్గొన్నారు.

పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ములుగులో నకిలీ కరెన్సీ కలకలం

ములుగు రూరల్, ఆగస్టు 12 : ములుగు జిల్లాకేంద్రంలో నకిలీ నోట్లు కలకలం రేపాయి. పత్తిపల్లి రోడ్డులోని గ్రోమోర్ ఎరువులు, పురుగు మందుల షాపులో పనిచేస్తున్న ఓ వ్యక్తి ములుగులోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో నగదు జమ చేసేందుకు వెళ్లాడు. అకౌంట్‌లో రూ.3.50 లక్షలను జమ చేసేందుకు క్యాషియర్‌కు అందించగా అందులో ఒక రూ.500 నోటు నకిలీదని బ్యాంకు అధికారులు నిర్ధారించారు. దీంతో సదరు వ్యక్తి సైతం ఖంగుతిన్నాడు. గతంలోనూ రెండు, మూడు సార్లు ఇదే బ్యాంకులో అధికారులు నకిలీ నోట్లను గుర్తించిన సందర్భాలున్నాయి. తాజాగా మరోసారి వెలుగు చూడడంతో ములుగు జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా నకిలీ నోట్ల చలామణి జోరుగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.అధికారులు నకిలీని అరకట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నకిలీగా నిర్ధారించిన 500 నోటు

పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని ఆందోళన

కాటారం, ఆగస్టు 12 : గ్రామంలో నెలకొన్న పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని మండలంలోని రేగులగూడెం గ్రామస్తులు సోమవారం ఆందోళన చేశారు. కొన్ని రోజులుగా నల్లాల లీకేజీతో మురుగు నీరు రోడ్లపైకి వచ్చి ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోడ్లపై, ఇంటి ముందు రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు సోకుతున్నాయన్నారు. పలు మార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోడంలేదని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, **RAPARTHY RAJESHWAR** (New name) previously called **RAPARTHY RAJESAWAR** (Old Name), S/o **RAPARTHY NAGAIAH,** R/o. "H" Towers, Flat no. 302, Opp: Filter bed, Warangal district - 506002. T.S. Solemnly declare.

NTW-17194

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

గిరిజన దర్బార్‌లో వినతుల వెల్లువ

తక్షణ పరిష్కారానికి పీవో ఆదేశాలు

ఏటూరునాగారం, ఆగస్టు 12 : స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలోని గిరిజనులు పాల్గొని పీవో చిత్రామిశ్రాకు వినతులు అందజేశారు. వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం గోమటిపల్లి తండాకు చెందిన భూక్యా లకుపతి పోడు భూమి ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన సీహెచ్ నాగమ్మ స్వీపర్ పోస్టు ఇప్పించాలని, కన్నాయిగూడెం మండలంలో గిరిజన భవన్ మంజూరు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడెం బాబు కోరారు. భూపాలపల్లి జిల్లా మల్హార్ మండలం కొయ్యూరు గ్రామానికి చెందిన గొట్టం సమ్మయ్య ఆర్‌వోఎఫ్ఆర్ భూమి పట్టా మార్చాలని కోరారు. ఇంకా పలు జిల్లాలకు చెందిన విద్యార్థులు గురుకులాల్లో సీట్లు కేటాయించాలని, పట్టా భూములకు హక్కు పత్రాలు, ఇవ్వాలని, ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. వినతులకు తక్షణ పరిష్కారం లభించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దర్బార్‌లో డీడీ పోచం, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఈఈ వీరభద్రం, డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతి కుమార్, డీటీ అనిల్ పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక ఆర్ఎంపీ ఆత్మహత్య

చిట్యాల, ఆగస్టు 12 : కడుపునొప్పి భరించలేక ఆర్ఎంపీ మృతి చెందిన ఘటన మండలంలోని జూకల్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జడల్‌పేట గ్రామ శివారు భీష్మ నగర్‌కు చెందిన బండారి ప్రభాకర్(41) జూకల్‌లో 15 ఏళ్లుగా ఆర్ఎంపీగా పనిచేస్తున్నాడు. ప్రభాకర్ కుడి కాలుకు ఫైలేరియాతో పాటు ఎనిమిదేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆదివారం సాయంత్రం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో గడ్డి మందు తాగి వచ్చాను అని భార్య రజితకు చెప్పాడు. వెంటనే అతడిని చిట్యాల సివిల్ దవాఖానకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు చెప్పారు. భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు

ప్రభాకర్ (ఫైల్)

సీఎంఆర్ డెలివరీ లక్ష్యాలను సాధించాలి : కలెక్టర్

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 12 : సెప్టెంబర్ 30 వరకు సీఎంఆర్ డెలివరీ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ రైస్ మిల్లర్లను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో సీఎంఆర్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు రైస్ మిల్లర్లతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో వానాకాలం 2023కి సంబంధించిన 16 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెండింగ్‌లో ఉందని, సెప్టెంబర్ 30 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. మార్కెట్‌లో రా రైస్‌కు ఎక్కువ డిమాండ్ ఉందని, మిల్లర్లు ఎంత ఎక్కువగా మిల్లింగ్ చేస్తే అంత తొందరగా వానాకాలం పంటకు మిల్లర్లు సిద్ధంగా ఉండొచ్చన్నారు. మిల్లర్లతో ప్రతి 15 రోజులకు ఒకసారి మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. సీఎంఆర్ డెలివరీలో జాప్యం చేస్తే ఆ ధాన్యాన్ని మరో మిల్లుకు కేటాయిస్తామన్నారు. క్రమం తప్పక మిల్లులు పని చేయాలని, రేప టి నుంచి రెవెన్యూ అధికారులు మిల్లింగ్ తీరును తనిఖీ చేస్తారని కలెక్టర్ అన్నారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల సంస్థ డీఎం రాఘవేందర్, రవి పాల్గొన్నారు.

సంపూర్ణతా అభియాన్ లక్ష్యాలను సాధించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 12 : సంపూర్ణతా అభియాన్ కార్యక్రమం లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలో నీతి అయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్‌గా గుర్తించిన పలిమెల, మహాముత్తారం మండలాల్లో సంపూర్ణతా అభియాన్‌పై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పలిమెల, మహాముత్తారం మండలాల్లో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా రెండు మండలాల్లో 35 ఏండ్లు దాటిన ప్రతి ఒక్కరి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. అవసరమైన వారికి మందులు అందించాలని సూచించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన పోషకాహారం అందించాలన్నారు. కేంద్రాల్లో కూరగాయల మొక్కలు పెంచాలని, ఆర్‌వో ప్లాంట్ ద్వారా శుద్ధిచేసిన నీరు ఇవ్వాలన్నారు. చదువు మానేసిన విద్యార్థులను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించాలని విద్యా శాఖ అధికారులను ఆ దేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు మట్టి నమూనాలను సేకరించి పరీక్షలు జరిపాలని, భూసారాన్ని బట్టి అనువైన పంటలు, డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పనపై అవగాహన కల్పించాలన్నారు. ఆస్పిరేషనల్ బ్లాక్ మండలాల్లో ఈ నెల 25 వరకు 80 శాతం అన్ని కార్యక్రమాల్లో ప్రగతి రావాలని, ఆ నివేదికలు అందజేయాలని అధికారులకు సూచించారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయండి

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. 15 ఆగస్టున వివిధ శాఖల ద్వారా స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించేందుకు జాబితా అందజేయాలన్నారు. వేడుకల్లో ప్రోటోకాల్ పాటిస్తూ సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, స్టేజ్ ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. జిల్లా ప్రగతి సందేశాన్ని తయారు చేయాలని డీపీఆర్వో, డీఆర్డీవోను ఆదేశించారు. అనంతరం ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి ఆయన అంబేద్కర్ స్టేడియాన్ని పరిశీలించారు. వర్షం కారణంగా నీరు నిలువకుండా గ్రావెల్‌తో నింపాలని మున్సిపల్ అధికారులను, విద్యుత్ సరఫరా అందించాలని సింగరేణి అధికారులను ఆదేశించారు.

దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 43 దరఖాస్తులు వచ్చాయని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలు పరిష్కరించాలన్నారు. అనంతరం జిల్లా అధికారులతో మత్తు పదార్థాలు నియంత్రణపై జిల్లా వ్యాప్తంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, సీపీవో సామ్యూల్, డీఆర్డీవో నరేశ్, డీఈవో రాజేందర్, డీఎంహెచ్‌వో మధుసూదన్, ఆర్డీవో మంగీలాల్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఖాజా మొయినుద్దీన్ పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్ : అంబేద్కర్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

ములుగు జిల్లా ప్రజావాణిలో 82 ఫిర్యాదులు.. కలెక్టర్ టీఎస్ దివాకర

ములుగురూరల్ : ప్రజావాణిలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అత్యధికంగా 82 మంది తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ టీఎస్ దివాకర, అదనపు కలెక్టర్ శ్రీజ, మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి అధికారులతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం మంత్రి సీతక్క హైదరాబాద్ నుంచి మాదక ద్రవ్యాలపై వీసీ నిర్వహించి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అధికారులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం మాదకద్రవ్యాల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

ప్రజల ఆకాంక్ష మేరకు పాలన ఉండాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

కృష్ణకాలనీ, ఆగస్టు 12 : ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవే ర్చాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, ఎన్నికల్లో ప్రతి హామీని నెరవేర్చాలని సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కొము రయ్య భవన్‌లో జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అధ్యక్షతన జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం నిర్వహించగా జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రాగానే దేశంలో నీట్ లీకేజీ లాంటి అనేక సమస్యలు తలెత్తి విద్యా ర్థులు, నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో సహకరించిన మిత్రపక్షాలకే అధిక నిధులు కేటాయించి, పక్షపాత ధోరణితో అవలంభించిందన్నారు. తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఉపాధి హామీ, మ ధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పేదలు వేసుకున్న గుడిసెలు, పక్కా ఇండ్ల కోసం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యం లో సీఎంను కలువనున్నట్లు చెప్పారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు కాబోతున్న సంర్భంగా వరంగల్‌లో మూడు రోజులు రాష్ట్రస్థాయి సమావేశాలు ఉం టాయన్నారు. జిల్లా కౌన్సిల్ సభ్యులు రమేశ్, పైళ్ల శాంతికుమార్, సమ్మిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, రామచందర్, విజేందర్, క్యాతరాజు సతీశ్, తాళ్ల పోశం, నెరేళ్ల జోసఫ్, వేముల శ్రీకాంత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మహదేవపూర్, ఆగస్టు 12 : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ లైన్ మరమ్మతు దృష్ట్యా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీకాంత్ సోమవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉత్తమ లైబ్రేరియన్‌గా చంద్రమౌళి

కృష్ణకాలనీ, ఆగస్టు 12 : జిల్లా ఉత్తమ గ్రంథపాలకుడిగా తుడుం చంద్రమౌళిని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పనిచేస్తున్న ఆయనను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ లైబ్రేరియన్‌గా ఎంపిక చేసింది. సోమవారం రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ చంద్రమౌళికి అవార్డును అందజేశారు.

అవార్డుతో చంద్రమౌళి

గుండెపోటుతో చికిత్స పొందుతూ వీవోఏ మృతి

వాజేడు, ఆగస్టు 12 : మండలంలోని అయ్యవారిపేటకు చెందిన వీవోఏ గుగ్గిళ్ల ప్రసాద్ (45) గుండెపోటుతో చికిత్స పొందుతూ హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో సోమవారం మృతి చెందాడు. పేరూరులో వీవోఏగా పనిచేస్తున్న ప్రసాద్‌కు చాతిలో నొప్పి రావడం భార్యతో కలిసి హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేరగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యువత సన్మార్గంలో ముందుకెళ్లాలి..

కాటారం, ఆగస్టు 12 : యువత సన్మార్గంలో నడుస్తూ సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు భూక్యా నవీన్ అన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనకు నిర్వహిస్తున్న పాదయాత్ర సోమవారం మండలంలోని గుమ్మళ్లపల్లి, పరికిపల్లి, ఆదివారంపేట గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా వారు యువత, విద్యార్థులు, గ్రామస్తులకు డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు, సోషల్‌మీడియా వల్ల కలిగే అనార్థాలను వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గడ్డం కవిత, బందు సుజాత, రజిత, సరిత, స్వాతి, జ్ఞానేశ్వరి, సుజాత పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఏటూరునాగారం, ఆగస్టు 12 : మండలంలోని జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో ఉన్న ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో కింద పడ్డాడు. తలకు గాయం కావడంతో తీవ్ర రక్త స్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై తాజుద్దీన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని అంబులెన్స్‌లో మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాలకు తరలించారు.

పీఏసీఎస్ వైస్ చైర్మన్‌కు నాయకుల పరామర్శ

ఏటూరునాగారం, ఆగస్టు 12 : ఏటూరునాగారం పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాల రాజును బీఆర్ఎస్ నాయకులు సోమవారం పరామర్శించారు. బాలరాజు తల్లి ఇటీవల మృతి చెందగా, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్, నాయకులు ప్రదీప్‌రావు, రమేశ్, భాస్కర్‌రావు, నర్సయ్య, నాగరాజు, శ్రీనువాస్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

వెంకటాపూర్, ఆగస్టు 12 : మండలకేంద్రంలోని ఎస్సీకాలనీలో మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు రమేశ్, ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి శ్యామ్ మాదిగ సోమవారం కోరారు. మందకృష్ణ మాదిగ ఢిల్లీ నుంచి మంగళవారం హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా లక్ష డప్పులతో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇసుక లారీలతో ఇబ్బందులు

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 12: మండలంలోని సూరవీడు ప్రధాన రహదారిపై సోమవారం ఇసుక లారీలను డ్రైవర్లు రోడ్డుకు ఇరువైపులా నిలిపారు. దీంతో ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భద్రాద్రి కొత్తగూడెం నుంచి వచ్చేపోయే వాహనదారులు సైతం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని లారీలను తొలగింపజేశారు.

రోడ్డుపై నిలిచి ఉన్న ఇసుక లారీలు

మొక్కలను తొలగిస్తున్న జీపీ సిబ్బంది

డిగ్రీ కళాశాల ఆవరణలో పిచ్చి మొక్కల తొలగింపు

'నమస్తే' కథనానికి స్పందన

మహదేవపూర్, ఆగస్టు 12 : మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను జీపీ సిబ్బంది సోమవారం తొలగించారు. ఈ నెల 10న 'నమస్తే'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఆవరణలోని చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. దీంతో ప్రిన్సిపాల్ జన్ను విజయ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

బీసీ కులగణన చేపట్టాలి

ములుగురూరల్, ఆగస్టు 12 : బీసీ కుల గణన జరిగే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించొద్దని బీసీ హక్కుల సాధన జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రాజు అన్నారు. సోమవారం గ్రీవెన్స్‌లో బీసీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని విడనాడాలన్నారు. బీసీ హక్కుల సాధన సమితి నాయకులు నర్సయ్య, రాజేందర్, శ్రీనివాస్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చిట్యాల, ఆగస్టు 12 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఒడితల పీహెచ్ సీ వైద్యుడు రాకేశ్ సూచించారు. సోమవారం జూకల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. నీటి ద్వారా వచ్చే వ్యాధులను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో 54 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా ఇద్దరి రక్త నమూనాలు సేకరించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ విజేత, ఏఎన్ఎం సంధ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 12 : గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ నరేశ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధి కేటీకే-5 ఇంక్లైన్ కమాన్ వద్ద ఒక వ్యక్తి గంజాయి అమ్ముతున్నాడనే సమాచారంతో ఎస్సై ప్రసాద్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అటువైపు నడుచుకుంటూ వస్తున్న ములుగు జిల్లా వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఎండీ పర్వేజ్ ఖాన్ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా అతడిని పట్టుకొని తనిఖీ చేయగా 1.300 కిలోల గంజాయి దొరికిందన్నారు. దాని విలువ సుమారు రూ.32,500 ఉంటందని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు